రేపు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సైదాబాద్: మనోభీష్టాల సిద్ధి కోసం సత్యనారాణస్వామి వ్రతం ఆచరించడం మన సాంప్రదాయమని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి తెలిపారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆలయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 26న ఆలయంలోని భక్తసమాజంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మార్గశిర మాసం, శుక్ల పక్షం పూర్ణిమ పర్వదిన సందర్భంగా నిర్వహించే ఈ వ్రతాల్లో పాల్గొనే వారికి ఆలయ కమిటీ వారే పూజా సామగ్రిని అందజేస్తుందని తెలిపారు. వ్రతం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నం. 9849569626లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అయితా అంజయ్య, కోశాధికారి తాండూరు కృష్ణయ్య, కన్వీనర్ గండె శ్రీకాంత్, చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత


సునీత్ పత్తికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మలక్‌పేట: బీఆర్ఎస్ పార్టీ సైదాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు సునీత్ పత్తి ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సునీత్ పత్తిని పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, పథకాలు ప్రజలకు చేరేలా పని చేస్తానని సునీత్‌పత్తి పేర్కొన్నారు.

ఎన్జీఓస్ కాలనీలో ప్రవచన సప్తాహం

వనస్థలిపురం: వనస్థలిపురం భక్త సమాజం, ధర్మాచార్య, హిందూ ధర్మ ప్రచార పరిషత్, టీటీడీల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్జీఓస్ కాలనీలోని చంద్రకళా వేదికపై ఈ నెల 24 నుంచి 30 వరకు ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్టు భక్త సమాజం అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 24న డాక్టర్ నారుమంచి శ్రీరామచంద్రమూర్తిచే సీతా కల్యాణం, 25న గాజుల సత్యనారాయణమూర్తిచే సుందరకాండ, 26న వద్దిరాజు జనార్దనరావుచే సంక్షేప రామాయణం, 27న వేముల రాజేశ్వర్‌రావుచే భక్త ప్రహ్లాద, 28న సుగ్గున శ్రీరాములుచే రుక్మిణీ కల్యాణం ప్రవచనాలు ఉంటాయన్నారు. అలాగే, 29న చెరువు పినాకపాణి శర్మచే పార్వతీ కల్యాణం, 30న డాక్టర్ కుప్పా శ్రీనివాసశాస్త్రిచే లక్ష్మీ కల్యాణం ప్రవచనాలు ఉంటాయని ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌కు చెందిన నాగేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్సపొంది కొన్ని రోజులకు మృతి చెందాడు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలవడంతో స్పందించిన ఆయన ఆసుపత్రి బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు, మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి: సీపీఎం

హస్తినాపురం: పార్లమెంటులో పొగబాంబువేసి పార్లమెంటు సభ్యులను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనకు భద్రతా వైఫల్యమే కారణమని నిలదీసిన పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ప్రశ్నించారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం నందనవనం కాలనీలో ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతుంటే లోక్‌సభ, రాజ్యసభలో 146 మంది సభ్యులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వెంటనే వారిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీపీఎం సభ్యులు కీసర నర్సిరెడ్డి, ఎండీ కమర్, ఆర్.పాండు, బి.దుర్గారావు, పురుషోత్తంచారి. శ్రీనుయాదవ్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.


నందనవనంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


క్రిస్మస్‌కు ముస్తాబైన వనస్థలిపురం ఎస్‌కేడీనగర్‌లోని లూథరన్ చర్చి


సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలోని బాప్టిస్ట్ చర్చి

అంతటా క్రిస్మస్ శోభ

● వేడుకలకు చర్చిల ముస్తాబు ● ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

దిల్‌సుక్‌నగర్/వనస్థలిపురం: అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది... యేసు క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలోని చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సామూహిక ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో బేకరీలు, స్వీట్‌షాపులు, షాపింగ్ మాల్స్ వద్ద కొనుగోళ్లదారుల రద్దీ నెలకొంది. బేకరీల్లో కొలువు దీరిన ప్రత్యేక కేకులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.


సచివాలయనగర్‌లోని క్రైస్ట్ గాస్పెల్ చర్చి


నల్గొండ క్రాస్‌రోడ్డులోని బెత్లెం చర్చి


వనస్థలిపురంలోని లిటిల్ లాంబ చర్చి

సాయి ట్రస్ట్ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మల్లయ్య, తదితరులు

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్– 2024 నూతన సంవత్సరం కేలండర్‌ను ఆదివారం ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య ఆవిష్కరించారు. సంస్థాన్ ఆధ్వర్యంలో జరిగే వివిధ పూజ, సేవా కార్యక్రమాల వివరాలను కేలండర్‌లో పొందుపర్చామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్థిక కార్యదర్శి ఆర్ఎస్ శంకర్‌రావు, జాయింట్ సెక్రటరీలు వీవీ రవికుమార్, ఎం. శ్యామలరావు, మాజీ అధ్యక్షుడు వనం యాదయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుదత్తాత్రేయ మహానామ పారాయణం


శృంగేరి శంకర మఠంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి శృంగేరి శంకర మఠంలో నిర్వహిస్తున్న గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆదివారం సామూహిక గురుదత్తాత్రేయ మహానామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహిళలు సత్యదత్త వ్రతం చేశారు. గురు చరిత్ర పారాయణం చేశారు. శృంగేరి శంకర మఠం బ్రాంచ్ హెడ్ క్రొవ్విడి శ్రీనివాస్, వీఆర్ గౌరీ శంకర్, విశ్వనాద్రి, బ్రహ్మశ్రీ ముదిగొండ శంకరశర్మ, మూర్తి, ఎడవల్లి సూర్యనారాయణ, గౌరీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్, వారాసిగూడ ప్రాంతానికి చెందిన ఇంటర్‌నేషనల్ సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి చేపూర్వ ప్రవల్లిక తాను సాధించిన రికార్డులతో ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వివరించారు. ఇటీవల సౌత్ కోరియా ఇంచోన్‌లో జరిగిన ఏషియా కప్ ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఇండియా టీంకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణి ప్రవల్లిక. పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకుంది. విద్యార్థిని ప్రవల్లిక సాధించిన విజయాలు అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మన రాష్ట్రం, దేశానికి మంచి పురు


ఇంటర్‌నేషనల్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ప్రవల్లికను అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. ఆ దిశగా విద్యార్థులు, క్రీడాకారులు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఎడెల్లి అజయ్ కుమార్, విద్యార్థిని తండ్రి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించండి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆదివారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జీ దీపదాస్ మున్షిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దీపదాస్ మున్షిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ పాలనలో బీసీలు దగాపడ్డారని ఆయన ఆరోపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి పరిస్థితులపై సమగ్ర పరిశీలన నివేదికను ఆమెకు అందజేశామన్నారు.

నేడు పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ

చంచల్‌గూడ: మాజీ ప్రధాని, దివంగత అటల్ బిహారీ వాజ్‌పాయీ జయంతి సందర్భంగా సోమవారం కుర్మగూడలో పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం పంపిణీ చేస్తామని డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి తెలిపారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రజక సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని రజకులు సంఘాలుగా విడిపోతే సమస్యలు పరిష్కారం కావని అందరూ ఒకే తాటిపై నిలబడితే సమస్యలు పరిష్కారం అవతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇప్పటికైనా రజక సంఘాలన్నీ విభేదాలను వీడి ఒకే సంఘంగా కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన వీర్లపల్లి శంకర్ అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్‌ను శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ, ఎం.అంజయ్యల పోరాటాల స్ఫూర్తిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రజకాభివృద్ధి సంస్థ జాతీయ అధ్యకుడు మోహన్‌రావు మాట్లాడుతూ... రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఏఎస్ఐ మృతి


ఏఎస్ఐ రాజేందర్‌రెడ్డి (ఫైల్)

నాగోలు: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ షీ టీమ్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌రెడ్డి (51) హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ నెల 11న విధులు ముగించుకొని ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ వైపు వెళ్తుండగా నాగోలు ఫ్లైఓవర్‌పై బైక్ స్కిడ్ అయి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నాగోలులోని సుప్రజా హాస్పిటల్ తరలించారు. వారం రోజుల పాటు చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి బంజారాహిల్స్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ రాజేందర్‌రెడ్డి చనిపోయాడు. పలువురు పోలీసు అధికారులు అతడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం నాగోలు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాజేందర్‌రెడ్డి అంత్యక్రియల కోసం షీ టీమ్ డీసీపీ 70 వేలు నగదు, ఇతర పోలీసులు సిబ్బంది 70 వేలు అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

జనవరి 4 నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సంయుక్త ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 9వ, తెలంగాణ రాష్ట్ర స్థాయి గుజ్జుల సుధాకర్‌రెడ్డి మెమోరియల్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2024 పోటీలను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం మూసారంబాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా, అల్మాస్‌గూడ, బీఎన్‌రెడ్డినగర్, ఏవైఆర్ క్రికెట్ గ్రౌండ్ పక్కన, ఫిట్‌నెస్‌ఫ్రీక్ అరేనా, సుధాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్ అకాడమీలో జనవరి 4 నుంచి 7 వరకు పోటీలు జరుగుతాయన్నారు. పురుషులు, మహిళల విభాగాలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్ పోటీలు జరుగుతాయన్నారు. నేషనల్ మాస్టర్స్ (వెటరన్) బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక పోటీలని, ఈ నెల 31 తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొనే క్రీడాకారులు వెబ్‌సైట్ లింక్ htt pr:// btso n i ne.i n/ ద్వారా చేసుకోవచ్చన్నారు. వివరాలకు 98660 14607 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సావిత్రి సుధాకర్‌రెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బ్యాట్ జాయింట్ సెక్రటరీ యూపీఎస్ బాబు ఉన్నారు.

పార్కు స్థలం కబ్జాకు యత్నం ?


స్థలం కబ్జాకు తాత్కాలిక పలకలను ఏర్పాటు చేసిన దృశ్యం

హయత్‌నగర్: భూముల కబ్జాలపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రభుత్వం ఓ వైపు హెచ్చరిస్తుండగా, మరో వైపు కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా కాలనీలోని కోట్ల విలువైన పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. హయత్‌నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో సుమారు 800 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు మూడు రోజులుగా హద్దులను ఏర్పాటు చేశారని కాలనీ వాసులు తెలిపారు. అన్మగల్ హయత్‌నగర్‌లోని సర్వే నెంబర్ 60 బై 2 నుంచి 60 బై 8 వరకు ప్రభుత్వ భూమి విస్తరించి ఉంది. ఇక్కడ ఆర్టీసీ మజ్దూర్ కాలనీ ఏర్పడింది. ప్రభుత్వం భూమిలో ఏర్పడిన ఈ కాలనీలో నిర్మించుకున్న ఇళ్లను ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తోంది. ఈ క్రమంలో ఇక్కడ ప్లాట్లు ఉన్న వారు ఇటీవల నిర్మాణాలు చేపట్టి రెగ్యులరైజ్ చేసుకుంటున్నారు. దీనిని అదునుగా చేసుకుని కబ్జారాయుళ్లు ఖాళీగా ఉన్న పార్కు స్థలంపై కన్నేశారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో పార్కు స్థలం చుట్టూ కడీలను ఏర్పాటు చేశారు. దానిని కాలనీ వాసులు అడ్డుకోవడంతో వాటి స్థానంలో తాత్కాలిక పలకలను ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అధికారులు అందుబాటులో లేకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి పార్కు స్థలం కబ్జాను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

పుస్తక పఠనంతో ఉన్నతంగా ఎదగవచ్చు


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి

సైదాబాద్: పుస్తక పఠనంతో ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా ఎదగవచ్చని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కేసిరెడ్డి విద్యార్థులకు సూచించారు. చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాలలోని డిజిటల్ లైబ్రరీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టోరీబాక్స్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టోరీబాక్స్ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచుతుందని, దాని పనితీరును వివరించారు. విద్యార్థులు ఈ మిషన్‌లో కథలు, పజిల్స్, చరిత్ర, కరెంట్ ఎఫైర్స్, కళలు ఇలా... తమకు నచ్చిన అంశం సెలెక్ట్ చేసుకుంటే అందుకు సంబంధించిన వివరాలు ప్రింట్ చేసి మెషీన్ విద్యార్థులకు అందజేస్తుందన్నారు. ఉత్తమ పఠన నైపుణ్యాలు ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీఏటీ బోర్డ్ మెంబర్ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ సేవ

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి పల్లకీ సేవ ఊరేగింపు ఆలయ మాడ వీధులలో నేత్రపర్వంగా కొనసాగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ప్రధాన అర్చకుడు యు.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన పల్లకీ సేవలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని తరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ వాల్మీకి, ఈవో మురళీ కృష్ణ, కార్పొరేటర్లు పవన్‌కుమార్ యాదవ్, శివకుమార్, దాతలు కృష్ణారెడ్డి, నరేందర్ గౌడ్, దామోదర్ సచిన్ సోని, పాలక మండలి సభ్యులు పద్మశంకర్ గౌడ్, కృష్ణ నాయి, సహదేవ్, అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.

'ఏకలవ్యుని విగ్రహావిష్కరణ' కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నేతలు

మన్సూరాబాద్: జిల్లెలగూడ చందన చెరువు వద్ద ఈ నెల 31న నిర్వహించే ఏకలవ్యుని విగ్రహావిష్కరణ కార్యక్రమం కరపత్రాన్ని ఆదివారం తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నేతలు మన్సూరాబాద్‌లో ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవుతారని వారు తెలిపారు. ఎరుకల కులస్తులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కురాకుల కృష్ణ, బాన్నపురం రఘు, చేర్ల రమేష్, శ్రీనివాసరావు,కృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పోలీసులు నిజాలు దాచారంటూ బంధువుల ధర్నా


శ్రవణ్ (ఫైల్)

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అయితే పోలీసులు నిజాలు దాచారని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7న పల్టాన్‌కు చెందిన శ్రావణ్ మన్వర్(24) అనే వ్యక్తి అర్ధరాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో నల్గొండ క్రాస్‌రోడ్స్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వెంటనే హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 11న మృతి చెందాడు. అయితే శ్రవణ్ కనిపించడంలేదంటూ అతని కుటుంబ సభ్యులు ఈనెల 11న పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శ్రవణ్ మృతి చెందాడని తెలియడంతో అతని బంధువులు న్యాయం చేయాలంటూ పీఎస్ ముందు ధర్నా నిర్వహించారు. పోలీసుల అలసత్వం కారణంగానే శ్రవణ్ చికిత్స వివరాలు తమకు తెలియలేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా విచారణ చేస్తున్నామని, త్వరలో కేసును ఛేదిస్తామని సీఐ ప్రకాష్‌రెడ్డి మృతుడి బంధువులకు చెప్పి పంపించి వేశారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.